క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామి తిరునాళ్ల

సత్తెనపల్లి: మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో నాగేంద్రస్వామి వారి తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్యాంకర్లతో తాగునీరు పంపిణీ



రాజుపాలెం: తాగునీటి సమస్యను అరికట్టేందుకు వేసవి పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని తెలిపారు. మండలంలోని కొండమోడు పరిధిలోని పార్వతీపురంలో తాగునీటి సమస్య ఉన్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో ఆదివారం పార్వతీపురం చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోర్లు ఎండిపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఈ భవాని మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యను అరికట్టేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రెండు నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభినట్లు తెలిపారు. కొండమోడు, పార్వతీపురం ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉచిత తాగునీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెం విద్యార్థినికి నవోదయలో సీటు



రాజుపాలెం: స్థానిక నవోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న జల్లిపల్లి శ్రావ్య జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో సీటు సాధించింది. మద్దిరాలలోని జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ఇటీవల రాసిన పరీక్షలలో మెరుగైన మార్కులు సాధించి ప్రవేశం పొందింది. విద్యార్థినికి ఎంఈవోలు మల్లిఖార్జున శర్మ, నర్సింహారావు, ప్రిన్సిపాల్ పత్తి రామారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హోంగార్డు సుభానికి అభినందనలు



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అరబిందో ఫార్మా కంపెనీ ఆపరేషన్స్, ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రెసిడెంట్ పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన శ్రీనివాసరెడ్డి హోంగార్డు సుభాని చలివేంద్రాన్ని సందర్శించి అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న సుభానిని ఆదర్శంగా తీసుకొని సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్ళం కోటిరెడ్డి, వీరారెడ్డి, మీరావలి స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లిలో పోలీస్ కవాతు



మాచవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి దుస్సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కే అమీనుద్దీన్ తెలిపారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సాయుధ బలగాలతో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలు ఉంటాయని తెలియజేశారు. సమస్యలు ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. గ్రామంలో ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

లోకానికి దివ్య మహిమను చాటిన ఏసుక్రీస్తు

- చర్చిలల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు
- ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు, విశ్వాసులు



పట్టణంలోని లూథరన్ చర్చిలో సామూహిక ప్రార్థనల్లో క్రైస్తవ సోదర, సోదరీమణులు

సత్తెనపల్లి: తన పునరుత్థానంతో తానే జీవమునని క్రీస్తు ప్రపంచానికి చాటారని పలువురు పాస్టర్లు అన్నారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా పట్టణం, మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు మరణం నుంచి మూడో రోజు కొత్త జీవంతో పునరుత్థానం చెందడం దైవాన్ని మహిమ పరిచినట్లయిందన్నారు. పాపులను రక్షించటం గుడ్ ఫ్రైడే సందేశమైతే, అంతం చేయాలన్న ప్రతిసారి సత్యమన్నది ఏదో రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నది ఈస్టర్ నేర్పిన పాఠమన్నారు. ఏసు మార్గంలో నడవాలని, సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని క్రీస్తు పునరుత్థాన ఘటనలను క్రైస్తవ సోదర, సోదరీమణులు, విశ్వాసులతో చదివించి అర్థాన్ని వివరించారు. వేకువ జాము నుంచే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన దుస్తులు ధరించి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఏసును కీర్తిస్తూ పాటలు పాడారు.

ముప్పాళ్ళ మండలంలో ఘనంగా ఈస్టర్

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఏసుక్రీస్తు మరలా జన్మించిన రోజున ఈస్టర్ పండుగ నిర్వహిస్తారు. అందులో భాగంగా చనిపోయిన పెద్దలు సమాధులను సందర్శించి శుభ్రం చేసి రంగులు వేసి పూలతో అలంకరిస్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల సంఘ కాపరులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొని క్రీస్తు సందేశాన్ని అందించారు.

రాజుపాలెంలో ఘనంగా ఈస్టర్

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల చర్చిలలో ఈస్టర్ పండుగ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని చర్చిలలో విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. స్థానిక పరిశుద్ధ మత్తయ లూథరన్ చర్చిలో రెవరండ్ ఎ.మత్తయ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించాల్సిన అవసరం ఉందని రెవరెండం మత్తయ తెలిపారు. క్రీస్తు పునర్జన్మ దైవసందేశాన్ని వివరించారు. సంఘస్తులు రెవరెండ్‌కు నూతన వస్త్రాలు బహూకరించి సన్మానించారు. గణపవరం, అనుపాలెం, బలిజేపల్లి తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ

అమరావతి: క్రీస్తు పునరుత్థాన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల చర్చిలలో శనివారం రాత్రి క్రీస్తు ఆరాధకులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకురాలు నంబూరు వసంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచాన్ని ఏలేటటువంటి స్వార్థం, దౌర్జన్యం, హింస, పిరికితనం, కుట్రలు, అబద్ధాలు.. ప్రేమ, క్షమాపణ, త్యాగం, వితరణ ముందు ఓడిపోవాల్సిందేనని క్రీస్తు పునరుత్థాన దినోత్సవం రుజువు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఈస్టర్ క్యాండిల్ ద్వారా తీర్థజలాన్ని తయారుచేసి భక్తులకు అందించారు. క్రైస్తవులకు అతిపవిత్రమైన క్రీస్తు పునరుత్థాన దినోత్సవం సందర్భంగా తమ పూర్వీకుల సమాధులను అందంగా అలంకరించి ఆదివారం వేకువజామున కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలో అన్ని చర్చిలలో ప్రభు ఆరాధకులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

ధరణికోటలో ఈస్టర్ పండుగ..

మండల పరిధిలోని ధరణికోట క్రీస్తు లూథరన్ చర్చిలో ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ ఏ సత్యానంద్ కుమార్ ఏసు ప్రభువు పునరుత్థానం గురించి బోధిస్తూ ఏసు సమాధి జెరుసలేములో ఖాళీ సమాధిగా ఇప్పటికీ రుజువుగా ఉన్నది కాబట్టి ప్రభువు మరణాన్ని జయించాడన్న విశ్వాసంతో క్రైస్తవులు ఈస్టర్ పండుగను సంప్రదాయంగా జరుపుకుంటున్నారన్నారు. ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పిల్లలు, మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

నకరికల్లులో ఈస్టర్ పర్వదినం

నకరికల్లు: పవిత్ర ఈస్టర్ పండుగను క్రైస్తవ విశ్వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు పునరుత్థాన రోజును ఈస్టర్ పర్వదినంగా క్రైస్తవులు భావిస్తారు. ఎంతో పవిత్రమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో చర్చిలలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయా చర్చిలలో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



ఇరుకుపాలెంలోని పరిశుద్ధ లూథరన్ దేవాలయంలో ప్రార్థనలు



మత్తయ లూథరన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు



లేమల్లె తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు

క్రోసూరులో ఘనంగా ఈస్టర్

క్రోసూరు: ఈస్టర్ సందర్భంగా క్రోసూరులోని ఇమ్మానియల్ లూథరన్ చర్చిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తు ఇచ్చిన సందేశాన్ని అందరూ పాటించి ప్రపంచాన్ని ప్రేమమయం చేయాలన్నారు. క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిల్కా దాసయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, దుగ్గి ఏడుకొండలు, వెలది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



క్రోసూరు ఏఈఎల్ చర్చిలో మాట్లాడుతున్న నంబూరు వసంతకుమారి

ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



నకరికల్లు: ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో వ్యవసాయ విద్యార్థులచే ఆదివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు రైతులతో మాట్లాడారు. గ్రామంలోని పంటలను పరిశీలించారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో గ్రామ పటం, పంటల సమస్యల వృక్షం, వృత్తవిలయం రంగులతో గీసి రైతులకు అవగాహన కల్పించారు. అందుబాటులో ఉన్న వంగడాలు, వాటి ధరలు వివరించారు. ఈ సందర్భంగా ఏవో దేవదాసు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బందితో తరచూ మాట్లాడుతూ సాగులో వచ్చే సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కార మార్గం తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హజరతయ్య ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కల్లూరి నాగేశ్వరరావు ఇంట్లో మద్యం అమ్ముతున్నట్లుగా సమాచారం అందటంతో సిబ్బందితో తనిఖీలు నిర్వహించామన్నారు. అతని వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైనార్టీల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

అమరావతి: మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పనిచేస్తుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక ముస్లిం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు షేక్ జానీ షరీఫ్, నజీర్ బాషా, ఇమాం షరీఫ్, ఖాశిం, రెహమాన్, అనిల్‌కుమార్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీరికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో 600 ఇళ్ల స్థలాలు ఇస్తే అందులో 198 ముస్లిం అక్కచెల్లెమ్మలకు ఇచ్చామన్నారు. అమరావతి మండలంలో ఇప్పటికే 4 షాదీఖానాలు నిర్మించి ప్రారంభించామన్నారు. అలాగే నియోజవర్గంలో మరో 16 నిర్మాణంలో ఉన్నాయన్నారు. నేడు చంద్రబాబు న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని వలంటీర్లను పనిచేయనీయకుండా పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తీసుకువచ్చారన్నారు. పార్టీ అభివృద్ధికి పాటు బడే కార్యకర్తలందరినీ కంటికిరెప్పలా కాపాడుకుంటానని ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదన్నారు. గత ఐదేళ్లలో నిజాయితీగా పాలన చేస్తున్న తనను, ముఖ్యమంత్రి జగనన్నను మనసారా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

గురజాల : ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జెడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన జమ్మిగుంపుల రామారావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని పాటించి పిల్లలను ఉన్నత స్థాయికి ఎదిగేలా రామారావు కృషి చేసారన్నారు. అదే విధంగా గురజాలలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బజారు బ్రాంచ్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగవరపు జయశేఖర్ పదవీ విరమణ చేశారు. కొమ్మినేని బుజ్జి, పాఠశాల చైర్మన్ జమ్మిగుంపుల రమేష్, మన్నెం గురవయ్య ఉన్నారు.

ఏసు దయతో మళ్లీ అధికారంలోకి వస్తాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రభువైన ఏసు దయ, ప్రజలందరి ఆశీస్సులతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, మీ అందరికి మరింత మంచి చేసే అవకాశాన్ని జీసస్ ఇస్తాడని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండల ఎస్సీ సెల్ కన్వీనర్ శిఖా తిమోతి ఆధ్వర్యంలో మళ్లీ జగన్ పాలన రావాలని, ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ 100 మందికిపైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శనివారం వేల్పూరు నుంచి తాళ్లచెరువు బాల ఏసు దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే కొద్దిసేపు నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలందరి ఆశీస్సులు జగన్‌మోహన్‌రెడ్డికి పుష్కలంగా ఉన్నాయన్నారు. మంచిచేసే వారికి, ఎదుటివారి కష్టాలు తెలుసుకునే వారికి ప్రభువు ఏసు కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మంచి జరిగిందని చెప్పారు. అన్ని గ్రామాలు బాగుపడ్డాయన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, వైద్యశాలలు, ఆర్బీకేలు, సచివాలయాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయని చెప్పారు. నిస్వార్థమైన మీ అందరి కోరిక నెరవేరుతుందని, జనం మెచ్చే పాలన వస్తుందని జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, శిఖా రాజారావు, వేల్పూరు పార్టీ కన్వీనర్ గోపీకృష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ నల్లపాటి సూర్యనారాయణ, పొన్నెకంటి వెంకట్రావు, జాగర్లమూడి అంకమ్మరావు, శిఖా చందు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

‘పల్లె’వించిన వైద్య సేవలు

- ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యం
- ఒక్కొక్క వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ.20.80 లక్షలు
- నియోజకవర్గంలో 48 భవనాలకు రూ.998.40 లక్షలు మంజూరు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామీణ ప్రజలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాయించి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో పేదలకు వైద్య సేవలు అందక అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పేదలకు గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందించదానికి వీలుగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ క్లినిక్‌లు గ్రామ స్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాయి.

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు వరంలా మారాయి. ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తిన అక్కడికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవడంతో పాటు తగిన వైద్యం పొందుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులతో బాధపడేవారికి ఇవి అనుకూలంగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు, పిల్లల టీకాలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వేదికలుగా మారాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అక్కడ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు సేవలు అందిస్తున్నారు.

ప్రతి సచివాలయం పరిధిలో..

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సత్తెనపల్లి నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలో 48 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. వాటిలో ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్, హెల్త్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 206 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అనారోగ్యానికి గురైన వారిని పరీక్షించి అవసరమైతే టెలీ మెడిసిన్ ద్వారా వైద్యులతో మాట్లాడిస్తున్నారు. అవసరమైతే పీహెచ్‌సీ, ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేస్తున్నారు.

వరంలా ఫ్యామిలీ డాక్టర్..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు వరంలా మారాయి. ప్రతి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో వారంలో రెండు సార్లు ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులు, స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అనారోగ్యంతో మంచంపై ఉన్న వారి ఇంటికే వెళ్లి పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు.

సేవలు ఇలా..

- రోజు క్లినిక్‌కు వచ్చే రోగులను పరీక్షించి మందులు ఇస్తారు.
- జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువ చేస్తారు.
- గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.
- హెల్త్ క్లినిక్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శిస్తూ రక్తహీనత, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం అందేలా చూస్తారు.
- మంచినీటి సరఫరా వ్యవస్థను, క్లోరినేషన్ వంటి వాటిని పరిశీలిస్తారు.
- పారిశుధ్యం, దోమల నివారణ వంటి కార్యక్రమాలతో పాటు డ్రైడే ఫ్రైడే నిర్వహణకు కృషి చేస్తారు.
- ప్రతి బుధ, శనివారం ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తారు.
- ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర వైద్యం, బేసిక్ లైఫ్ సపోర్ట్ విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.
- ఎవరైనా పాముకాటుతో వస్తే ఏం చేయాలి? పాయిజన్ కేసులు వస్తే ఎలా వ్యవహరించాలి..? గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.



ధూళిపాళ్లలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు



నందిగామలో బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



లక్కరాజుగార్లపాడులో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మండలంలో చురుగ్గా ఇంటింటి ప్రచారం

అచ్చంపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి ఒకటో తారీఖునే ఠంచనుగా పింఛన్ ఇంటి వద్దనే అందుకోవాలంటే జగనన్న సీఎం అయితేనే సాధ్యపడుతుందని, లేకుంటే పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిందేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. మండలంలోని నీలేశ్వరపాలెంలో శనివారం రాత్రి ఎమ్మెల్యేగా శంకరరావును గెలిపించాలని కోరుతూ ఆమె ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మహిళలు ఆమెకు నీరాజనాలు పలికారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత మనందరి ప్రభుత్వానికి బేరీజు వేసుకోవాలని ఆమె సూచించారు. ఏ ఒక్కరికి రూపాయి కూడా లంచం ఇవ్వకుండా, ఎవరి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు మీ బ్యాంకు ఖాతాలకు జమకావాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలన్నారు. దగాకోరుల మాటలు నమ్మొద్దన్నారు. అర్హతే ప్రామాణికంగా వచ్చే సంక్షేమ పథకాలు వదులుకుని, చంద్రబాబు అండ్ కో మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గత అయిదేళ్లలో ఎమ్మెల్యేగా శంకరరావు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారాని, మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గంలో ఎన్నో మంచి పనులు చేస్తారని చెప్పారు. ముఖ్యంగా పులిచింతల నుంచి బ్యాకు వాటర్ తెప్పిస్తారని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుస్తారని, మాదిపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తారని, నిర్మాణ దశలో ఉన్న అమరావతి–బెల్లకొండ డబుల్ రోడ్డు పూర్తవుతుందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే శంకరన్నను ఆశీర్వదించాలని కోరారు. ఆమె వెంట మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, నీలేశ్వరపాలెం సర్పంచ్ కోటేశ్వరరావునాయక్, మండల మహిళా కన్వీనర్ గ్రంథి నాగలక్ష్మి, మండల భవిత మండల సమాఖ్య అధ్యక్షులు చల్లా రత్నమంజీర, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



నీలేశ్వరపాలెం గ్రామస్తులతో నంబూరు వసంతకుమారి

• దుస్తులు పంపిణీ

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ప్రతి ముస్లిం దానధర్మాలు చేయాలని సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ యూసుఫ్ అలీ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసం వద్ద రంజాన్ పండగను సందర్భంగా 700 మంది ముస్లింలు, నిరుపేదలకు రూ.7 లక్షలు విలువైన దుస్తులు, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు.